సాక్షి
సంగారెడ్డి
మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం
న్యాల్‌కల్ పరిధిలోని చినిగెపల్లిలో షార్ట్ సర్క్యూట్‌తో పత్తికి నిప్పంటుకుంది. సుమారు 180 క్వింటాళ్లు కాలిపోయింది. రూ.14 లక్షల మేర నష్టం వాటిల్లింది. 10లో



అందరికీ ఆరాధ్యుడు సేవాలాల్
సేవాలాల్ మహారాజ్ అందరికీ ఆరాధ్యుడేనని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎంపీ సీతారాంనాయక్ అన్నారు. 10లో



పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్
సీఎం సహాయనిధి పథకం నిరుపేదలకు వరం లాంటిదని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. 11లో

న్యూస్‌రీల్

9, 10 తేదీల్లో 'సుకన్య సమృద్ధి యోజన' మేళాలు

పోస్టల్ ఎస్పీ ఎస్‌వీఎల్‌ఎన్ రావు

సంగారెడ్డి టౌన్: తపాలా శాఖ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం నిర్వహిస్తున్న సుకన్య సమృద్ధి ఖాతా మేళాలో ఆడపిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలకు సుకన్య సమృద్ధి అకౌంట్ ఖాతాలు తెరిచి బాలికల బంగారు భవిష్యత్‌కు తోడ్పడాలని పోస్టల్ ఎస్పీ ఎస్‌వీఎల్‌ఎన్ రావు పిలుపునిచ్చారు. ఢిల్లీలో జాతీయ స్థాయి స్టాంప్‌ల ప్రదర్శనలో భాగంగా సంగారెడ్డి డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో తపాల శాఖ ఆధ్వర్యంలో సుకన్య సమృద్ధి ఖాతా మేళాలు ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని పది సంవత్సరాల లోపు ఆడపిల్లలు కలిగిన తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుకన్య ఖాతాలకు కేంద్ర ప్రభుత్వం 7.6 శాతం వడ్డీ చెల్లిస్తుందని, అలాగే జమ అయిన సొమ్ముకు ఆదాయపు పన్ను మినహాయింపు పొందవచ్చని తెలిపారు. అన్ని తపాలా కార్యాలయాల్లో కేవలం రూ.250 చెల్లించి సుకన్య సమృద్ధి అకౌంట్ ఖాతా ప్రారంభించవచ్చని పేర్కొన్నారు. సుకన్య ఖాతా ఓపెన్ చేయడానికి పాప జనన ధ్రువీకరణ పత్రం, తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు జిరాక్స్, పాన్ కార్డు జిరాక్స్, తల్లి లేదా తండ్రి మూడు ఫొటోలు ఉంటే చాలన్నారు. గరిష్ఠంగా ఒక కుటుంబంలోని ఇద్దరు ఆడ పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా జడ్జి శశిధర్ రెడ్డి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్జి శశిధర్‌రెడ్డి, తదితరులు

సంగారెడ్డి టౌన్: లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి ఎస్.శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పర్చువల్ పద్ధతిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ 16 జిల్లాల్లో భుయాన్‌ను ప్రారంభించారు. అనంతరం సంగారెడ్డి పట్టణంలో జిల్లా జడ్జి జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సంగారెడ్డి కోర్టు ఆవరణలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ద్వారా జైలులో ఉన్న ఖైదీల తరఫున వాదించేందుకు తోడ్పడుతుందన్నారు. జిల్లా కోర్టులో ఉన్న సెషన్స్ కేసులను చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దేవిదాస్, మెజిస్ట్రేట్ కోర్టుల్లో ఉన్న ఖైదీల కేసులను అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ విచేందర్, అశ్విని వాదిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హన్మంత్ రావు న్యాయమూర్తులు బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు చరమ గీతం పాడాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి



మాట్లాడుతున్న నరేందర్ రెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): బీజేపీయే బీఆర్‌ఎస్‌కు చరమగీతం పాడుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం సంగారెడ్డిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యకర్తలందరూ బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఇంటికీ చేర్చాలన్నారు. అలాగే కేసీఆర్ చేస్తున్న మోసాలను ఎండగడుతూ ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రతి కార్యకర్త ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఒక సైనికుడిలా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీయే అని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంతురెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు, కో కన్వీనర్ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ప్రసాది రవి శంకర్, కొండాపురం జగన్ పాల్గొన్నారు.

నీళ్లకు నిధులు

- నల్లవాగుకు రూ.15.54 కోట్లు..
- సింగూరుకు రూ.22 కోట్లు
- జిల్లాలోని ప్రాజెక్టులకు కేటాయింపులు





సింగూరు ప్రాజెక్టు(ఫైల్), (ఇన్‌సెట్‌లో) బడ్జెట్ ప్రవేశపెడుతున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలోని రెండు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఈ బడ్జెట్‌లో సింగూరు ప్రాజెక్టుకు కేటాయింపులు కొంత మేరకు తగ్గాయి. 2022 – 23 బడ్జెట్‌లో రూ.28.90 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.22.86 కోట్లకు పరిమితమైంది. నల్ల వాగు కాల్వల ఆధునీకరణ పనులకు నిధులు కాస్త పెరిగాయి. గతేడాది రూ.10.01 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.15.54 కోట్లకు పెంచారు. ఈ కేటాయింపుల మేరకు నిధులు విడుదలైతే పనులు నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంటాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నల్లవాగు ఆధునీకరణ పూర్తయ్యేనా?

నల్లవాగు కాల్వల ఆధునీకరణ కోసం చేపట్టిన పనులు చాలా ఎళ్లుగా పూర్తి కావడం లేదు. రూ.24 కోట్లతో చేపట్టిన ఈ పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఇప్పటివరకు కేవలం రూ.8 కోట్ల మేరకు మాత్రమే పనులు జరిగాయి. ఈ పనులు చేసేందుకు ఏడాదిలో కేవలం మూడు, నాలుగు నెలలు మాత్రమే సమయం ఉంటుంది. ఈ కీలక సమయంలో వేగంగా పనులు చేస్తేనే ఈ ఆధునీకరణ పనులు పూర్తవుతాయి. కానీ ఈ మేరకు పనులు జరగడం లేదు. ఈ పనులను పూర్తి చేసేందుకు నీటిపారుదలశాఖ సుమారు రూ.15 కోట్ల మేరకు ప్రతిపాదనలు పంపగా, ఈ బడ్జెట్‌లో రూ.15.54 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత బడ్జెట్‌లో రూ.10.10 కోట్లు కేటాయించినప్పటికీ రూ.రెండు కోట్లకు మించి రాలేదని సమాచారం. కాగా కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.2,614 కోట్ల మేరకు కేటాయింపులు చేశారు. అయితే ఇందులో జిల్లాలో ప్యాకేజీలకు సంబంధించిన పనులకు ఏ మేరకు నిధులు వస్తాయన్నది వేచి చూడాలి.

రాష్ట్ర పథకాలతో జిల్లాకు లబ్ధి

- సొంతింటి నిర్మాణానికి రూ.3 లక్షలు: సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు రూ.3 లక్షల మేరకు ఆర్థిక సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు జరిపింది. నియోజకవర్గానికి రెండు వేల మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది. ఈ లెక్కన జిల్లాలో సుమారు పదివేల మందికి లబ్ధి చేకూరుతుందని అంచనా.
- **ఆసరా పింఛన్లు:** బడ్జెట్‌లో ఆసరా పథకానికి రూ.12 వేల కోట్లు కేటాయించారు. జిల్లాలో ఆసరా పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల సంఖ్య 1.63 లక్షలుగా ఉంది. వీరికి నెలకు రూ.2,016 చొప్పున ప్రతినెలా రూ.36.82 కోట్లు ఆర్థిక సహాయం అందిస్తున్నారు.
- **దళితబంధు:** ఈ పథకానికి రూ.17,700 కోట్లు కేటాయించారు. నియోజకవర్గానికి 1,100 మంది చొప్పున ఐదు నియోజకవర్గాల్లో సుమారు 5,500 మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది.
- **రుణమాఫీ అయ్యేనా?:** రూ.లక్ష లోపు పంట రుణాల మాఫీకి జిల్లాలో 1.89 లక్షల మంది రైతులు అర్హులుగా ఉన్నారు. ఇందులో ఇప్పటివరకు రూ.25 వేల లోపు రుణం ఉన్న వారి రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయి. అలాగే రూ.25 వేల నుంచి రూ.50 వేల లోపు ఉన్న వారిలో కేవలం 10,165 మంది రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయి. ఇంకా 1.69 లక్షల మంది రైతుల రుణాలు మాఫీ కావాల్సి ఉంది. ఈ బడ్జెట్‌లో రుణ మాఫీకి రూ.6,385 కోట్లు కేటాయించారు. ఇందులో ఎంత మంది రుణాలు మాఫీ అవుతాయో వేచి చూడాలి.
- **రైతుబంధు:** రూ.1,575 కోట్లను రైతుబంధుకు కేటాయించగా ఈ పథకం ద్వారా జిల్లాలో 3.24 లక్షల మంది రైతులు లబ్ధిపొందుతున్నారు. గత వానాకాలం, యాసంగి సీజన్లలో కలిపి రూ.707 కోట్ల మేరకు ఆర్థిక సహాయం రైతుల ఖాతాల్లో జమ అయింది.
- **రైతుబీమా:** రూ.1,589 కోట్లు కేటాయించారు. ఈ పథకంలో ఇప్పటివరకు 1.89 లక్షల మంది రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. 2008 నుంచి ఇప్పటివరకు మరణించిన రైతు కుటుంబాలకు రూ.299 కోట్ల బీమా పరిహారం చెల్లించారు.
- సెర్ప్ ఉద్యోగుల పేస్కేల్ సవరణ చేయాలనే నిర్ణయంతో జిల్లాలో 193 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. అలాగే కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై కూడా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ నుంచి కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని బడ్జెట్‌లో పేర్కొన్నారు. జిల్లాలో 550 మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు.

'సింగూరు' నిర్వహణకు..

జిల్లాలో ప్రధాన నీటి పారుదల ప్రాజెక్ట్ సింగూరుకు ఈ బడ్జెట్‌లో రూ.22.86 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు నిర్వహణతో పాటు పలు అభివృద్ధి పనులకు ఈ నిధులను కేటాయించనున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.28.90 కోట్ల మేరకు కేటాయించినప్పటికీ రూ.19.01 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. అయితే ఈసారి కాస్త కేటాయింపులు తగ్గాయి. రూ.22.86 కోట్లలో ఏ మేరకు నిధులు విడుదలవుతాయో వేచి చూడాల్సి ఉంది. జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన ప్రత్యేక ప్రస్తావన బడ్జెట్‌లో కనిపించలేదు. బసవేశ్వరకు సంబంధించి బోరంచ పంప్‌హౌజ్ నిర్మాణాన్ని త్వరలో ప్రారంభించే యోచనలో నీటిపారుదలశాఖ ఉంది.

ప్రజా ఆమోదయోగ్యమైన బడ్జెట్



అన్ని వర్గాల సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమపాళ్లలో మేళవించిన బడ్జెట్. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు భారీగా నిధులు కేటాయించి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచింది. మహిళా సాధికారతకు బడ్జెట్‌లో పెద్దపీట వేశారు.

– శివకుమార్, డీసీఎంఎస్ చైర్మన్

కీలకమైన పథకాలకు పెద్దపీట



ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా బడ్జెట్ ఉంది. దళిత బంధు, రైతు రుణ మాఫీతో పాటు ఇంటి స్థలం ఉన్న వారికి రూ.3 లక్షల ఆర్థిక సహాయం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. రోడ్ల మరమ్మతులకు అధిక నిధులు కేటాయించడం హర్షణీయం

– క్రాంతికిరణ్, అందోలు ఎమ్మెల్యే

అన్ని రంగాలకు మేలు



అసెంబ్లీలో మంత్రి హరీశ్‌రావు ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేదిగా ఉంది. రైతులు, మహిళలు, ఇరిగేషన్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బలహీన వర్గాలకు కేటాయింపులు పెంచారు. పట్టణ, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం కల్పించారు.

– మాణిక్‌రావు, జహీరాబాద్ ఎమ్మెల్యే

కాగితాల్లోనే కేటాయింపులు



దళిత సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయిస్తున్న నిధుల్లో సగం కూడా ఖర్చు చేయడం లేదు. దళితులకు మూడెకరాల భూమి ఊసే లేదు. కేటాయించిన ప్రతీ పైసా ఖర్చు చేస్తేనే బడ్జెట్‌కు సార్థకత ఉంటుంది.

– మాణిక్యం, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ప్రజావాణికి 38 అర్జీలు

- త్వరగా సమస్యలు పరిష్కరించాలి
- కలెక్టర్ డాక్టర్ శరత్



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

సంగారెడ్డి టౌన్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించిలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి జిల్లా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 38 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రెవెన్యూ, ఆసరా పింఛన్లు, భూ సర్వే, డబుల్ బెడ్రూం ఇళ్లు, పింఛన్, తదితర సమస్యలపై అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శరత్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన వినతులు ఆయా శాఖల అధికారులు పరిశీలించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇల్లు మంజూరు చేయాలి



నా పేరు సత్తార్ అహ్మద్. మాది కోహీర్. దివ్యాంగుడిగా ఉండటంతో పూట గడవటం కష్టంగా ఉంది. బయట ఎటువంటి పనిచేయలేని స్థితిలో ఉన్నాను. ప్రభుత్వం అందజేస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లలో ఇల్లు మంజూరు చేయాలని ప్రజావాణిలో వేడుకున్నారు.

కొత్త పాస్ బుక్ అందించాలి



నా పేరు పుష్పమ్మ. చేర్యాల గ్రామం. మా అత్తమామల కాలం నుంచిమిని సాగు చేసుకుంటున్న భూమికి ఇప్పటికీ పాస్ బుక్ రాలేదు. మొత్తం పది గుంటల పట్టా కావడం లేదు. అధికారులు కొత్త పాస్ బుక్ అందించాలని ప్రజావాణిలో అర్జీ సమర్పించింది.

సింగూరు కాల్వలకు మరమ్మతులు చేయాలి



సింగూర్ కాల్వలకు మరమ్మతులు చేసి పంట పొలాలు నీట మునగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అందోల్ మండలం చందంపేట గ్రామం నుంచి సాయిబాన్ పేట వైపు వెళ్లే సింగూర్ కాల్వలో మట్టి పేరుకుపోయి కాల్వకు గండ్లు పడి నీరు వృథాగా పంట పొలాల్లో చేరుతోందని, దీంతో పొలాలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర ఆధ్వర్యంలో చందంపేట రైతులు హనుమాదాస్, రామస్వామి, శంకరయ్య అర్జీ అందజేశారు. వెంటనే సింగూర్ కాల్వల్లో పూడికను తొలగించాలని వేడుకున్నారు.

'ఏడుపాయల'కు ప్రత్యేక బస్సులు



సంగారెడ్డి టౌన్: మహాశివరాత్రిని పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం ఏడుపాయలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుందని మెదక్ రీజియన్ యస్.సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు 135 ప్రత్యేక సర్వీసులు ఉంటాయన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలకు జోగిపేట, మెదక్, సంగారెడ్డి నర్సాపూర్, బాల్‌నగర్, సదాశివపేట, నారాయణఖేడ్, ఝరాసంఘం, శంకరంపేట్, జహీరాబాద్, జేబీఎస్ వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అవిశ్వాస నోటీసు అందజేత



కలెక్టర్‌ను కలిసిన కౌన్సిలర్లు

అవిశ్వాస నోటీసును అందజేస్తున్న కౌన్సిలర్లు

జోగిపేట(అందోల్): అందోలు – జోగిపేట మున్సిపల్ చైర్మన్‌పై బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసును సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ శరత్‌కు అందజేశారు. నోటీసును స్వీకరించిన కలెక్టర్ అవిశ్వాసం అమలుకు ప్రభుత్వం నాలుగు సంవత్సరాలకు పెంచుతూ అసెంబ్లీ, కేబినెట్ మీటింగ్‌లో ఆమోదం తెలిపిందని, ఈ బిల్లుకు సంబంధించి ఉత్తర్వులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అవిశ్వాస పత్రాన్ని ప్రభుత్వానికి పంపిస్తానని, సంబంధిత కౌన్సిలర్ల ఐడీ కార్డులను కూడా మున్సిపాలిటీ నుంచి తెప్పించుకుంటానని కలెక్టర్ చెప్పినట్లు కౌన్సిలర్లు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపినట్లు వారు చెప్పారు. అక్కడి నుంచి సాయంత్రం మున్సిపల్ కమిషనర్ రవిబాబును కలిసి అవిశ్వాసపత్రాన్ని అందజేశారు. కలెక్టర్, కమిషనర్‌ను కలిసిన వారిలో కౌన్సిలర్లు భవాని, నాగరాజు(నాని), దుర్గేశ్, చందర్, పడిగె సుమిత్ర, భారతి, మాధవి, పిట్ల భాగ్యలక్ష్మి, ప్రవీణ, జాకియ సుల్తానా, గాజుల ధనలక్ష్మి ఉన్నారు.

కేతకిలో భక్తుల సందడి



పోగడ చెట్టు వద్ద దీపాలను వెలిగిస్తున్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): కేతకి సంగమేశ్వర ఆలయం భక్తులతో సందడిగా మారింది. మహాశివరాత్రి సమీపిస్తుండటంతో ఆలయానికి భక్తుల తాకిడీ పెరుగుతోంది. సోమవారం తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల్లోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమృతగుండంలో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరించి, గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులకు దర్శించుకున్నారు. అదేవిధంగా భక్తులు అభిషేకం, కుంకుమార్చన, అర్చన, కట్లం పూజ, వాహన పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా కర్ణాటక రాష్ట్రంలోని బసవకళ్యాన్ ప్రాంతానికి చెందిన భక్తులు 11వేల దీపాలను ఆలయం చుట్టూ వెలగించి, మొక్కులు చెల్లించారు.

నేడు ఏర్పాట్లపై సమావేశం

మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 15 నుంచి నిర్వహించే జాతర బ్రహ్మోత్సవాలపై అన్ని శాఖల అధికారులతో కోఆర్డినేటింగ్ సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శశిధర్ పేర్కొన్నారు. సమావేశానికి కలెక్టర్ శరత్, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్ హాజరుకానున్నట్లు తెలిపారు.

ఉచిత టోల్ పాస్‌లు ఇవ్వాలి

- తాడ్దాన్‌పల్లి జాతీయ రహదారి దిగ్బంధం
- స్థానికులకే ఉద్యోగాలివ్వాలని డిమాండ్
- ఉమ్మడి పుల్కల్ మండల ప్రజల ఆందోళన



జాతీయ రహదారిపై బైఠాయించిన నాయకులు, ప్రజలు



రోడ్డుకు ఇరువైపులా నిలిచిపోయిన వాహనాలు

జోగిపేట(అందోల్): 161 జాతీయ రహదారి పనులు, తాడ్దాన్‌పల్లి వద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌లో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని, 25 కిలో మీటర్ల దూరం ఉన్న గ్రామాలకు ఉచిత పాస్‌లను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి పుల్కల్ మండలానికి చెందిన ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తాడ్‌దాన్‌పల్లి చౌరస్తా వద్ద సోమవారం జాతీయ రహదారిని రెండు గంటల పాటు దిగ్బంధం చేశారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు, వాహనదారులు పెద్ద సంఖ్యలో ఈ ఆందోళనలో పాల్గొన్నారు. జాతీయ రహదారి కావడంతో రెండువైపులా వందల సంఖ్యలో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న పోలీసులు ముందస్తుగా తాడ్‌దాన్‌పల్లి టోల్‌గేట్ వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి, జోగిపేట సీఐ నాగరాజు, ఎస్‌ఐలు సొమ్యానాయక్, గణేశ్‌లతో పాటు సీఆర్‌పీఎఫ్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు.

నేషనల్ హైవే అధికారుల హామీతో..

రోడ్డుపై ధర్నా చేస్తున్న వారికి పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా, నేషనల్ హైవే, టోల్ గేట్ అధికారులు వచ్చి హామీనిచ్చేంత వరకు ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దీంతో పోలీసులు వారికి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న నేషనల్ హైవే అథారిటీ అధికారులు సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ధర్నా ముగిసిన వెంటనే ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

అండర్ పాస్ ఏర్పాటు చేయాలి

జాతీయ రహదారిపై చేపట్టిన ధర్నా కొంత ఉద్రిక్తతకు దారీ తీసింది. తాడ్‌దాన్‌పల్లి చౌరస్తా వద్ద అండర్ పాస్ రోడ్డును ఏర్పాటు చేయాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. 25 గ్రామాల ప్రజలు సంగారెడ్డి వైపు వెళ్లాలంటే నాలుగు కిలో మీటర్ల దూరం వెళ్లి యూటర్న్ తీసుకోవాల్సి వస్తోందని, దీంతో ఎనిమిది కిలో మీటర్ల దూరం పెరుగుతుందన్నారు. తాడ్‌దాన్‌పల్లి వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేసేందుకు రైతులు జేసీబీని తెప్పించి, రోడ్డుపై డివైడర్‌ను పగలగొట్టే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, వారికి కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. నేషనల్ హైవే సైట్ ఇంజనీర్లు హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లి అండర్ పాస్ రోడ్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో స్థానిక నాయకులు, ప్రజలు శాంతించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ధర్మ ప్రసారక్ కోకన్వీనర్ సుభాష్ చందర్, బీఆర్‌ఎస్ నాయకులు పల్లె సంజీవయ్య, నర్సింహారెడ్డి, విజయ్ కుమార్‌లు మాట్లాడారు. జాతీయ రహదారి నిర్మాణంలో అనేక సమస్యలు ఉన్నాయని, టోల్‌పాస్‌కు 25 కిలో మీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు టోల్ ఫీజును మినహాయింపు ఇవ్వాలని, ఉచితంగా పాస్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారి నిర్మాణంలో ఎందరో భూములను కొల్పోయారని, ఆ కుటుంబాలకు టోల్‌గేట్‌లలో ఉద్యోగాలు ఇవ్వాలన్నారు.

క్లుప్తంగా

మహిళా ప్రాధాన్యంపై హర్షం

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



నర్సాపూర్: రాష్ట్ర బడ్జెట్‌లో మహిళల సంక్షేమం కోసం నిధులు కేటాయించడంపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మహిళల సంక్షేమానికి ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. సీఎం కేసీఆర్, ఆర్థిక మంత్రి హరీశ్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జయరెడ్డి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): కేసీఆర్ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, ప్రజాసంక్షేమాన్ని విస్మరించారని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తూర్పు జయరెడ్డి మండిపడ్డారు. సోమవారం మండల పరిధిలోని ఎల్లారంలో హాత్‌సే హాథ జోడో పాదయాత్రను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడీల రాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కాంగ్రెస్‌జెండా ఎగురవేసి తమ సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముగ్దుమ్ పటేల్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చాట్ల సిద్దన్న, సర్పంచ్‌లు భూపాల్ రెడ్డి,నర్సింలు,గంగన్న,ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్, సుగుణమ్మ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఆశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ప్రకటనపై ఉద్యోగుల హర్షం



మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న టీఎన్జీఓ నాయకులు

మెదక్‌జోన్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల కుటుంబాలకు ఆరోగ్య భద్రత కల్పిస్తామని అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు సోమవారం ప్రకటించారు. మెదక్‌లో టీఎన్జీఓ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దొంత నరేందర్, మినికి రాజ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఆరోగ్య భద్రత కల్పిస్తూ అసెంబ్లీలో ప్రకటించడం హర్షణీయమన్నారు. అలాగే ఏటా రూ.700 కోట్ల బడ్జెట్‌ను ఈహెచ్‌ఎస్ అమలుకు ప్రభుత్వ నిధులు కేటాయిస్తామని చెప్పడం శుభ సూచకమన్నారు. ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సెర్ప్ ఉద్యోగులకు వేతన స్థిరీకరణ ప్రకటించిన సీఎం కేసీఆర్, ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

యువత భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలి

నవలా రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్



జహీరాబాద్: యువత సక్రమ మార్గంలో భవిష్యత్‌కు బంగారు బాట వేసుకోవాలని నవలా రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని ఆర్‌ఎల్ కన్వెన్షన్ హాల్‌లో ఇంపాక్ట్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత తప్పుడు నిర్ణయాలతో భవిష్యత్‌ను పాడుచేసుకుంటున్నారన్నారు. క్రమ శిక్షణ, పట్టుదలతో ఉన్నత చదువులు చదివి భవిష్యత్‌ను తీర్చి దిద్దుకోవాలన్నారు. పలు అంశాలపై క్విజ్, క్వశ్చన్ అవర్ నిర్వహించారు. శిక్షణా తరగతుల్లో వేణుగోపాల్, కృష్ణ ప్రదీప్, సుధీర్ సాంద్ర, వేణు కళ్యాణ్, గంప నాగేశ్వర్‌రావు తదితరులు మానసిక వికాసం తదితర అంశాలపై మాట్లాడారు.

అందరికీ ఆరాధ్యుడు సేవాలాల్

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించేలా సీఎం దృష్టికి తీసుకెళ్తా

- హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై సేవాలాల్ విగ్రహం ఏర్పాటు చేయాలి
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎంపీ సీతారాంనాయక్



చౌడుతండాలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్

అక్కన్నపేట(హుస్నాబాద్): సేవాలాల్ మహారాజ్ కేవలం గిరిజనుల ఆరాధ్య దైవం మాత్రమే కాదని, అందరికీ ఆరాధ్యుడేనని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎంపీ సీతారాంనాయక్ అన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని చౌడుతండాలో ఆలిండియా బంజారా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ధరావత్ తిరుపతినాయక్ ఆధ్వర్యంలో సోమవారం సేవాలాల్ మహారాజ్ (284)వ జయంతి, భోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి, సాంప్రదాయాలు, సంస్కృతికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా తెలంగాణ రాష్ట్రంలో తప్ప దేశంలో ఇంకెక్కడా జరపడం లేదంటే ఇది తెలంగాణ రాష్ట్ర గొప్పదనమన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. అలాగే హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, ఆ దిశగా గిరిజనులంతా ఏకతాటిపైకి వచ్చి సీఎం దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బంజారా జాతి అంతరించకుండా కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతి గిరిజనుడిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తనయుడు వొడితెల ఇంద్రనీల్, ఎంపీపీ లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, లంబాడా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉర్సె షరీఫ్ ఉత్సవాలు



ఉర్సె షరీఫ్ దర్గాను దర్శించుకుంటున్న ప్రజలు

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ శివారులలోగల ఉర్సె షరీఫ్ పిర్‌గైబ్ సాహెబ్ దర్గా ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా నాలుగో రోజు సోమవారం న్యాల్‌కల్ నుంచి దర్గా వరకు మేళతాళాలతో ఖురేషి గంధం తీసుకెళ్లారు. రాత్రి నిర్వహించిన ఖవ్వాలి వీక్షకులను అలరించింది. దర్గా పరిసర ప్రాంతాల నుంచే కాకుండా సమీప కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా ప్రజలు తరలి వచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం ఉత్సవాల్లో కొనసాగిన పశువుల సంత సోమవారం కూడా కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, వ్యాపారులు క్రయవిక్రయాలు నిర్వహించారు. నేడు కుస్తీ పోటీలు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జాతరలో కుస్తీ పోటీలు నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన మల్లయోధులు పోటీల్లో పాల్గొననున్నారు. భారీ భద్రత మధ్య ఈ పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబర్చిన మల్లయోధులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

కొడిపల్లి సబ్‌స్టేషన్‌లో కోతుల సంచారం

- విద్యుత్ వైర్లకు తగలడంతో కాలిపోయిన బ్రేకర్
- సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా కట్
- సుమారుగా రూ.10 లక్షల మేర నష్టం



మరమ్మతులు చేస్తున్న కార్మికులు

కొడిపల్లి(నర్సాపూర్): సబ్‌స్టేషన్‌లో కోతులు సంచరిస్తున్నాయి. విద్యుత్‌వైర్లకు తగడంతో బ్రేకర్ కాలిపోయింది. దీంతో రెండు గ్రామాల సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా నిలిపోయింది. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. ఈ సంఘటన మండల కేంద్రమైన కొడిపల్లిలోని 132/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం జరిగింది. సబ్‌స్టేషన్ డీఈ జయమ్మ, కొడిపల్లి ఇన్‌చార్జి ఏఈ రాంబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొడిపల్లిలో 132/11 కేవీ సబ్‌స్టేషన్‌లో కోతులు విద్యుత్‌వైర్లకు తగలడంతో సబ్‌స్టేషన్‌లోని బ్రేకర్ కాలిపోయింది. దీంతో కంచన్‌పల్లి, వెల్మకన్న గ్రామాలలోని సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సుమారు రూ.10 లక్షల మేర నష్టం వాటినట్లు తెలిపారు. హైదరాబాద్ కార్మికులు మరమ్మతులు చేస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని వినతి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరావు

పటాన్‌చెరుటౌన్: విధుల్లో నిర్లక్ష్యంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండని పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరావు డిమాండ్ చేశారు. మండలంలోని రుద్రారం పంచాయతీ కార్యదర్శి రాజకుమార్‌పై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని చెత్తడంప్ యార్డును తోషిబా పరిశ్రమ పక్కన నిర్మించారన్నారు. చెత్తను నాలుగు నెలలుగా గ్రామంలోని ఈద్గా వద్ద పంచాయతీ కార్యదర్శి ఆదేశాలతో వేస్తున్నారని ఫిర్యాదులో ఆరోపించారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

- కాలిపోయిన పత్తి విలువ రూ.14 లక్షలు
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వినతి



తగలబడుతున్న పత్తి

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి పత్తి దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని చినిగెపల్లి గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పత్తికి నిప్పంటుకొని సుమారు 180 క్వింటాళ్ల వరకు కాలిపోయింది. రూ.14 లక్షలు మేర నష్టం వాటిల్లింది. పత్తికి ప్రస్తుతం ఆశించిన మేర ధర లేకపోవడంతో దానిని అమ్మకుండా రైతులు గ్రామంలో నిల్వ చేశారు. ఖాళీ స్థలంలో రైతులు శేరి బస్‌గొండ, శివారెడ్డి, జబ్బికర్ నర్సప్ప సుమారు 450 క్వింటాళ్ల పత్తి నిల్వ చేసుకున్నారు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం పొలం పనుల కోసం వెళ్లారు. మధ్యాహ్నం పత్తిని నిప్పంటుకొని మంటలు ఎగిసిపడ్డాయి. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు రైతులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న రైతులు, గ్రామస్తులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. వారి ప్రయత్నం ఫలించకపోవడంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించిందని రైతులు వాపోయారు. తామంతా తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



రామ్ పర్వేశ్ మృతదేహం

చేగుంట(తూప్రాన్): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన చేగుంట శివారులో సోమవారం సాయంత్రం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రం ఓక్ గ్రామానికి చెందిన రామ్ పర్వేశ్(22) చేగుంట వెన్‌కాఫ్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం విధులు ముగించుకొని వెళ్లిన రామ్‌పర్వేశ్ మక్కరాజీపేట రోడ్డు బ్రిడ్జీ సమీప ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సోమవారం సాయంత్రం విగతజీవిగా కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ శవపంచనామా నిర్వహించారు. మృతుడి కాలు ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ కేబుల్‌కు తగిలి ఉండటంతో విద్యుదాఘాతంతో మృతి చెంది ఉంటాడని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈమేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు

కారు ఢీ: నలుగురికి గాయాలు

పటాన్‌చెరు టౌన్: కారు ఢీ కొనడంతో నలుగురు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటన భానూర్-బీడీఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సాయిలు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన అజిత్ కుమార్ అతడి స్నేహితులు అనీస్, సురజిత్, కేశిక్, సామెన్ మైతి బతుకు దెరువు కోసం రాష్ట్రానికి వచ్చారు. పటాన్‌చెరు మండలం భానూర్‌లో ఉంటున్నారు. ఫ్లవర్స్ డెకరేషన్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 5వ తేదీ సాయంత్రం అనీస్, సురజిత్, కేశిక్, సామెన్ మైతి భానూర్ నుంచి నందిగామ వైపు వాకింగ్‌కు వెళ్లారు. భానూర్ దాటిన తరువాత భానూర్ నుంచి నందిగామ వస్తున్న కారు వీరిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని చికిత్స కోసం బీరంగూడ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అజిత్ కుమార్ తన స్నేహితులను ఢీకొట్టిన కారు డ్రైవర్ పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతానికి గురై..

రామాయంపేట(మెదక్): మండలంలోని లక్ష్మాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్టిజన్ కార్మికుడిగా నవీన్‌కుమార్ పనిచేస్తున్నాడు. సోమవారం ఎల్‌సీ తీసుకుంటున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఏఈ పెంట్యానాయక్ ఆస్పత్రికి వచ్చి బాధితున్ని పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు

మెదక్ మున్సిపాలిటీ: తమ భూమిని ఆక్రమించుకొని నానా ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వెల్దుర్తి మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సోమవారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. వెల్దుర్తి మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డికి అచ్చంపేట గ్రామ సర్వే నంబర్ 188లో నాలుగు ఎకరాల పొలం ఉంది. దానిలో 30 ఏళ్లుగా కాస్తులోఉన్నట్లు తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లో యుగేందర్ రెడ్డి తమ పొలంలోకి అక్రమంగా ప్రవేశించాడని, ప్రశ్నిస్తే బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అలాగే మండలంలోని వెంకటాపూర్ గ్రామ సంగ్య తండాకి చెందిన సుమలత తన భర్త రోజూ తాగొచ్చి ఇబ్బందులు పెడుతున్నాడని ఫిర్యాదు చేసింది. బాధితులకు చట్టప్రకారం న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీఆదేశించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య



సజద్ అలీ (ఫైల్)



విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

దుబ్బాక: ఆర్థిక ఇబ్బందులు తాళలేక జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాయపోల్ మండలం మంతూర్‌లో సోమవారం జరిగింది. రాయపోల్ ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంతూర్ గ్రామానికి చెందిన సజద్ అలీ (48) వ్యవసాయం చేసేవాడు. రెండేళ్లుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. అప్పులు ఎలా తీర్చాలో తెయడంలేదని భార్యకు చెప్పి బాధపడేవాడు. ఆదివారం అర్ధరాత్రి ఉరి వేసుకుననాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా చేశారు. మృతుడి సోదరుడు హైమద్ హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అనారోగ్య సమస్యలతో..

రామాయంపేట(మెదక్): అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వివాహిత చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంపేట మండలం తిప్పనగుల్ల గ్రామానికిచెందిన గొల్ల కల్యాణిని ఐదేళ్ల క్రితం ధర్మారం గ్రామానికి చెందిన గొల్ల స్వామికి ఇచ్చి వివాహం చేశారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు జనవరి 18న జన్మించాడు. ఆమె ఆరోగ్యం సరిగా లేకపోవడంతో కల్యాణి తన తల్లిఎల్లవ్వ, అమ్మమ్మ నర్సవ్వతో కలిసి ధర్మారంలోని అత్తగారింటిలోనే ఉంటుంది. ఆదివారం రాత్రి అందరూ నిద్రించిన తర్వాత కల్యాణి తెల్లవారు జామున గ్రామశివారు ఊర చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామాచెందిన యువకుడు చెరువు వద్దకు వెళ్లగా కల్యాణి మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. అతడు మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చెరువు వద్దకు వెళ్లారు. ఆత్మహత్యకు పాల్పడ్డ కల్యాణి మృతదేహం రెండు గంటల్లోపే నీటిపై తేలడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో జారిపడి యువతి మృత్యువాత



దివ్య (ఫైల్)

వర్గల్(గజ్వేల్): కుటుంబానికి సాయంగా ఉన్న కూతురి పెళ్లి చేద్దామనుకుంటున్న తల్లిదండ్రుల కోరిక తీరకముందే ఇంట్లో జారిపడిన మృత్యువాతపడింది. ఈ ఈ ఘటన సోమవారం వర్గల్ మండలం మజీద్‌పల్లిలో చోటుచేసుకున్నది. కుటుంబీకులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మజీద్‌పల్లికి చెందిన లింగ రమేశ్, పద్మ దంపతులకు బాబు, దివ్య ఇద్దరు పిల్లలు. కొడుకు డిగ్రీ, కూతురు దివ్య(21) డిప్లొమా కోర్సు పూర్తి చేశారు. ఆ కుటుంబానికి రెక్కల కష్టమే ఆధారం. దివ్య దుస్తులు కుడుతూ కుటుంబానికి సాయంగా ఉంది. బుధవారం తెల్లవారుజామున కాలకృత్యాల కోసం లేచిన దివ్య ప్రమాదవశాత్తు ఇంట్లోనే జారిపడింది. తలకు తీవ్ర గాయమై కొద్దిసేపట్లోనే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. వెంటనే ఆ యువతిని కుటుంబీకులు ములుగు సమీప ఆర్వీఎం ఆస్పరలించారు. అక్కడ ఐదురోజులపాటు మృత్యువుతో పోరాడిన దివ్య సోమవారం మృతిచెందింది.

ఉత్సాహంగా సాక్షి ప్రీమియర్ లీగ్



గౌతమ్ జూనియర్ కళాశాల జట్టు



జెఎన్‌టీయు కూకట్‌పల్లి జట్టు

ఫైనల్స్‌కు చేరిన జూనియర్ జట్లు...

SPL SAKSHI PREMIER LEAGUE

SAKSHI | SAKSHI DIGITAL MEDIA GROUP

ఘట్‌కేసర్: మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో సాక్షి ప్రీమియర్ లీగ్-4 (ఎస్‌పీఎల్) సోమవారం ఉత్సాహంగా కొనసాగాయి. ఈ పోటీల్లో గ్రేటర్ పరిధిలోని 65 జట్లు పాల్గొంటున్నాయి.

విజేతల వివరాలివీ...

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం-1లో

- మొదటి మ్యాచ్ సీనియర్ విభాగంలో సైనిక్‌పురి భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్-బి జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 58 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనురాగ్ యూనివర్సిటీ జట్టు 6.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 59 పరుగులు చేసి విజయం సాధించింది.
- రెండో మ్యాచ్ జూనియర్ విభాగంలో తిరుమలగిరి గౌతమ్ జూనియర్ కళాశాల జట్టు మొదట బ్యాటింగ్ చేసి 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సికింద్రాబాద్ గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ జట్టు 9.3 ఓవర్లలో 56 పరుగులు చేసి ఓటమిపాలైంది.
- మూడో మ్యాచ్‌లో జూనియర్ విభాగంలో సైనిక్‌పురి భవాన్స్ శ్రీ అరబిందో కాలేజ్-ఎ జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 151 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన తిరుమల్‌గిరి గౌతమ్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 60 పరుగులు చేసి పరాజయం పాలైంది. భవాన్స్ జట్టు క్రీడాకారుడు సాధిక్ 40 బంతుల్లో 118 పరుగులు చేశాడు.

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం-2

- మొదటి మ్యాచ్‌లో జూనియర్ విభాగంలో శ్రీ దత్త డిప్లమో కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన అవినాశ్ కాలేజ్ 5.5 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 96 పరుగులు చేసి గెలుపొందింది. అవినాశ్ జట్టు క్రీడాకారుడు సనద్ 23 బంతుల్లో 55 పరుగులు చేశాడు.
- రెండో మ్యాచ్ సీనియర్ విభాగంలో దిల్‌సుఖ్‌నగర్ అవంతి పీజీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 67 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్-ఎ జట్టు 4.5 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 68 పరుగులు చేసి గెలుపొందింది.
- మూడో మ్యాచ్ జూనియర్ విభాగంలో గౌతమ్ కాలేజ్-ఎ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన అవినాశ్ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసి పరాజయం పాలైంది.

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం-3

- మొదటి మ్యాచ్‌లో శ్రీ అరబిందో జూనియర్ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 116 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన సీఎంఆర్ డిప్లమో కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 56 పరుగులు చేసి పరాజయం పాలయ్యింది.
- రెండో మ్యాచ్ సీనియర్ విభాగంలో జేఎన్టీయూ హైదరాబాద్‌హెచ్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 76 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన కేపీఆర్ఐటీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 74 పరుగులు చేసి పరాజయం పాలైంది.
- మూడో మ్యాచ్ సీనియర్ విభాగంలో సైనిక్‌పురి భవన్స్ వివేకానంద ఎ-జట్టు 10 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 141 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన జేఎన్టీయూ హైదరాబాద్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 63 పరుగులు చేసి ఓడింది. భవాన్స్ క్రీడాకారుడు నితీశ్ 31 బంతుల్లో 68 పరుగులు చేశాడు.

ఫైనల్స్‌కు చేరిన జూనియర్ జట్లు...

జూనియర్ విభాగంలో సైనిక్‌పురి భవన్స్ శ్రీ అరబిందో కాలేజ్, ఈసీఐఎల్ గౌతమ్ కాలేజ్ జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

విద్యుదాఘాతంతో రైతు మృతి



పోచయ్య (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): పొలానికి నీళ్లు పారబెట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన అల్లాదుర్గం మండలం రెడ్డిపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన మైలారం పోచయ్య(35) బోరు వద్ద వరి పంట సాగు చేస్తున్నాడు. పంటకు నీరు పెట్టేందుకు సోమవారం తెల్లవారు జామున పొలానికి వెళ్లాడు. కాగా ఇంటికి దగ్గరలోనే పొలం ఉండటంతో అక్కడ ఒక బల్బు ఏర్పాటు చేసుకున్నాడు. అయితే దాని వైరు తెగిపోయింది. బోరు ఆన్ చేయడానికి వెళ్తూ వైరు తాకడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. గమనించిన భార్య కవిత భర్తను కాపాడేందుకు ప్రయత్నించగా ఆమె కూడా విద్యుత్ షాక్ తగిలింది. ఆమె పక్కకు జరిగి కేకలు పెట్టడంతో స్థానికులు అక్కడికి చేరుకుని చూడగా పోచయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



నర్సింగరావు మృతదేహం

మనోహరాబాద్(తూప్రాన్): చేపల కోసం విసిరిన చేపలవలలో చిక్కి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. మనోహరాబాద్ ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన మన్నె నర్సింగరావు (35) ఆదివారం సాయంత్రం గ్రామంలోని కాశబోయిన కుంటలో చేపలు పట్టడానికి వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఉదయం కుంట వద్ద వెళ్లిఎవెతకగా గట్టుపైన నర్సింగరావు దుస్తులు, చెప్పులు గుర్తించారు. సోమవారం కుంటలో వెతకగా చేపల వలలో చిక్కుకుని నీటమునిగి ఊపిరాడక మృతి చెందాడు. భార్య నవనీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని శవపరీక్షకు తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. నర్సింగరావు మృతికి కుంటలోని భారీ గుంతలే కారణమని ఆరోపించారు.

అదృశ్యమైన.. చెరువులో శవమై



షేక్ నజర్ (ఫైల్)

దుబ్బాక: ఇంటి నుండి వెళ్లిన యువకుడు కనిపించకుండా పోయి చెరువులో శవమై తేలాడు. ఈ ఘటన రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో జరిగింది. సోమవారం రాయపోల్ ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన షేక్ నజర్(33) 2022 డిసెంబర్ 30వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడి సోదరుడు షాదుల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నెల గడిచినా నజర్ ఆచూకీ లభించలేదు. ఆదివారం రాత్రి వడ్డేపల్లి గ్రామ శివారు చెరువులో ఓ రైతుకు మృతుదేహం కనిపంచడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి పరిశీలించగా కనిపించకుండా పోయిన షేక్ నజర్‌దిగా గుర్తించారు. మృతుడి సోదరుడు షాదుల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

గొడవను వారిస్తున్న తండ్రిని నెట్టడంతో..

- కిందపడి మృతి
- సూరారం గ్రామంలో విషాదం



దొంతిస్వామి మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): భార్యాభర్తల పంచాయితీ విషయంలో బావ బావమరుదులు తగవు పడుతున్నారు. గొడవ వద్దని వారించిన తండ్రిని బలంగా నెట్టేయడంతో కిందపడి మృతి చెందాడు. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సూరారం గ్రామంలో దొంతి కృష్ణ తన బావమరింది చెదల్ సుభాశ్ గొడవపడుతుండగా వారించేందుకు వెళ్లిన కృష్ణ తండ్రి దొంతిస్వామి(55)ని మధ్యలో ఎందుకు వస్తున్నావని బలంగా నెట్టేశారు. దీంతో గ్రామంలోని సీసీ రోడ్డుపై పడటంతో తీవ్రంగా గాయపడటంతో స్పృహతప్పాడు. వెంటనే అతడిని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.